


# ఒక్కరోజు

వసుంధర

**కౌముది - రచన నిర్వహించిన కథల పోటీ(2017)లో**
**సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ.**

పుట్టగానే సరిపోదు. బిడ్డ పుట్టుకకు గుర్తింపునిచ్చేది బర్త్ సర్టిఫికెట్.

ఆధునిక యుగంలో బిడ్డ మనుగడకి బర్త్ సర్టిఫికెట్ కావాలి. మనుగడ అంటే బ్రతుకుతెరువే కాదు, ఒకోసారి కేవలం మనుగడకే కూడా!

పుట్టిన ప్రతి మనిషికీ మరణం తప్పదు. దానికి డెత్ సర్టిఫికెట్ అవసరం. ఐతే ఒకోసారి బర్త్ సర్టిఫికెట్‌లోనే జీవన్మరణ సమస్య ఉండొచ్చు. అదెలాగంటే.....

\- - - - -

ఖరీదైన కారు ఆ భవనం ముందాగింది. ముందు సీట్లోంచీ తలుపు తెరుచుకుని డ్రైవరు దిగాడు. అతడి దుస్తులు పరిశుభ్రంగా ఉన్నా, కారు హోదాకి కాక, డ్రైవరు హోదాకి తగినట్లు ఉన్నాయి.

డ్రైవర్ వెనక్కి వెళ్లి బ్యాక్‌డోర్ తలుపు తీసి పట్టుకున్నాడు.

కార్లోంచీ దిగాడో శాల్తీ. పేరు రామనాథం.

ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, ఖద్దరు కండువా. ఐనా కూడా ఖరీదైన మనిషిలా ఉన్నాడు.

రామనాథం ముందుకి కదల్లేదు. స్వాగతం పలకడానికి ఇంకా ఎవరూ రారేమని భవనం వైపే చూస్తున్నాడు. ఆ చూపులు భవనంలోకీ చొరబడి అక్కడున్న సుదర్శనం అనే చిరుద్యోగి భుజం తట్టి హెచ్చరించాయి. అతడు వెంటనే పరుగులాంటి నడకతో బయటికొచ్చాడు. ఆయాసపడుతూ ఆయనకి రెండు చేతులూ జోడించి, “చివరి క్షణంలో చేతిమీద టీ ఒలికింది సార్! ఆ చేత్తో తమకెలా దణ్ణం పెడతాను? చెయ్యి కడుక్కొచ్చేసరికి ఇలా ఆలస్యమైంది. తమరికేం ఇబ్బందవలేదుగా?” అన్నాడు.

సంజాయిషీ ఇవ్వడం మర్యాద. సుదర్శనం పాటించిన మర్యాదకి రామనాథం ముఖం కాస్త ప్రసన్నమైంది.

సుదర్శనం ముందుకి దారి తీశాడు. రామనాథం హుందాగా అతణ్ణి అనుసరించాడు. ఆయన డ్రైవరు నెమ్మదిగా బ్యాక్‌డోర్ మూసి కారు పార్కు చేసుకునే ప్రయత్నంలో పడ్డాడు.

రామనాథం భవనంలో కింద అంతస్తులో హాల్లో ప్రవేశించాడు. అక్కడ పని చేసుకుంటున్న ఉద్యోగుల్లో కొందరు చప్పున లేచి నిలబడ్డారు. వాళ్లని చూసి మిగతావాళ్లు లేచారు. రామనాథం ఎవర్నీ పట్టించుకోలేదు. తనకా ప్రాంతం సుపరిచితమే నన్నట్లు నేరుగా అక్కడున్న ప్రత్యేకమైన ఎయిర్ కండిషన్డు గదిలో దూరాడు.

“ఎవరాయన?” అన్నాడు రెణ్ణెళ్ల క్రితమే అక్కడ చేరిన ఓ కొత్త ఉద్యోగి.

“పేరు రామనాథం. చాలా పెద్ద తలకాయ. పల్లెనుంచి ఢిల్లీదాకా ఎంతటి పెద్దలకైనా తలలు మార్చగల అఖండుడు. ఆయనతో పెట్టుకున్నవాళ్లకి తలలుండవు. ఇలా మనసులో అనుకోగానే, అలా పనులైపోతాయ్ ఆయనకి. కానీ ఈరోజు స్వయంగా వచ్చాడు. ఎవరికో మూడింది” అన్నాడు పక్కనున్న ఉద్యోగి. చేరి ఏడాదే ఐనా అక్కడి విషయాలు చాలా తెలుసన్న గర్వం అతడి మాటల్లో తొణికిసలాడింది.

అతణ్ణి కాస్త తగ్గించాలన్నట్లు, “నీకింకో విషయం తెలియదు. మామూలుగా ఐతే ఆ ఎయిర్ కండిషన్డు గది వెయిటింగ్ రూం. కానీ రామనాథానికి మీటింగ్ రూం. ఇప్పుడు చూడు, మన బాసే ఆయన్ని కలవడానికి ఆ రూంకి వెడతాడు” అన్నాడు ఇంకొంచెం పాత ఉద్యోగి.

ఆ మాటలు నిజం చేస్తూ, కొద్ది క్షణాల్లోనే వాళ్ల బాస్ వినయ్ ఆ గదిలోకి వెళ్లాడు.

అప్పటికి రామనాథం సోఫాలో వెనక్కి జారగిలబడ్డాడు. వినయ్ వచ్చేక కూడా ఆయన అదే భంగిమలో ఉన్నాడు. అంతవరకూ ఆయనముందు బాగా వంగి నిలబడ్డ సుదర్శనం, బాస్ రాగానే అదే భంగిమలో బయటకు వెళ్లిపోయాడు. అప్పుడు వినయ్ ఆయన్ను సమీపించి అచ్చం సుదర్శనంలాగే వంగి నిలబడ్డాడు.

రామనాథం ముందు వినయ్ అలా వంగడం రహస్యమేం కాదు. ఐనా అది చిన్న స్టాఫ్ ముందు జరక్కూడదు. అందుకే సుదర్శనం వెళ్లిపోయాడు. ఆ ఏర్పాటు రామనాథానికీ ఇష్టమే.

“బర్త్ సర్టిఫికెట్ రెడీ అయిందా?” అన్నాడాయన.

“ఇంకా లేదండి!” అన్నాడు వికాస్.

రామనాథం కళ్లుఎర్రబడ్డాయి. “ఎందుకని?” అన్నాడు. మాట కూడా ఎర్రగానే ఉంది.

“రికార్డ్సన్నీ ఖచ్చితంగా ఉన్నప్పుడు మార్చడం కష్టమండి. పైగా ఆ సీటుమీద పీఎంఓ నిఘా ఉందండి”

“ఉంటేనేం? చిన్న పని – చిన్న పని చెయ్యలేరా? ఎందుకున్నట్లు మీరంతా?”

వికాస్ గొంతు సవరించుకుని, “ఒరిజినల్ని మార్చడం చిన్న పనేనండి. ఆ మార్పుని వెనక్కి తీసుకోవడం అంత చిన్న పని కాదండి. చాలామందిని ఆకట్టుకోవాలి” అన్నాడు.

“మార్పు జరిగిన రికార్డ్సు మాఫీ చెయ్యలేరా?” అన్నాడు రామనాథం.

“మీకు తెలియందేముంది? ఈ డిపార్టుమెంట్లో నందిని పంది చెయ్యగలం. మళ్లీ పందిని నంది చెయ్యాలంటే అంత సులభం కాదండి”

రామనాథం తల అడ్డంగా ఊపి, “ఒరిజినల్లో తప్పుందనుకుని సవరించమని కోరాం. సవరించారు. ఇప్పుడేమో ఒరిజినలే కరెక్టని తెలిసింది. కరెక్టు మనుషులం, కరెక్టుగా ఉండాలనుకోవడం తప్పు కాదుగా! అందుకే ఒరిజినల్ని రిస్టోర్ చెయ్యమంటున్నాం. ఐనా సైన్సు బోల్డు డెవలప్పయింది. ఒరిజినలే కరెక్టనడానికి, మెడికల్ టెస్టులు కూడా ఉన్నాయి. ఏమిటి కష్టం?” అన్నాడు.

“కష్టమంతా పీఎంవో నిఘా వల్లనండి” అన్నాడు వికాస్.

“ఈ దేశంలో చట్టం దారి చట్టానిదే. మన దారి మనదే. నిఘా దారి నిఘాదే. ఎటొచ్చీ విషయం నాదాకా రాకూడదు. అవసరమైతే డబ్బుతో గోడ కట్టు” అన్నాడు రామనాథం తేలికగా.

“గోడ కట్టడం కష్టం కాదండి. వాటికి చెవులు మొలవకుండా ఆపడమేనండి చిక్కు!” అన్నాడు వికాస్.

“స్వయంగా ఇక్కడికొచ్చాను. ఆ విషయం తెలియాల్సినవాళ్లకి తెలిస్తే, మొలవాల్సిన చెవుల మాటటుంచు. ఇప్పటికే మొలిచున్న చెవులు కూడా గల్లడిపోతాయ్. ఇక మాటలొద్దు. ఈరోజుకి సరిగ్గా వారం తర్వాత మళ్లీ ఇక్కడికొస్తాను. బర్త్ సర్టిఫికెట్ నా చేతికందాలి” అని లేచాడు రామనాథం.

ఆయన మొహంలో గాంభీర్యముంది. అది మేకపోతు దనుకుందుకు లేదు.

“నా ప్రయత్నం నేను చేస్తానండి. ఆపైన మీ దయ, నా ప్రాప్తం” అన్నాడు వికాస్.

రామనాథం దయకీ, వికాస్ ప్రాప్తానికీ ఉన్న అవినాభావసంబంధం ఆ ఇద్దరికీ తెలుసు.

ఏడాది వయసు బాబు. తెల్లగా బొద్దుగా ముద్దుగా ఉన్నాడు. దయపర్ మినహా ఏ ఆచ్ఛాదనా లేదు. రెండు తప్పటడుగులు ముందుకేసి ఆగి వెనక్కి తిరిగాడు. సోఫాలో కూర్చుని తనని ముచ్చటగా చూస్తున్న పల్లవి కనిపించింది.

వెంటనే వాడి ముఖంలో చిరునవ్వు. అందులో కొంచెం చిలిపితనం. కొంచెం ఆశ. కలిపి చిన్నికృష్ణుడి దైవత్వం. అలాంటి నవ్వు వాడి వయసుకే సాధ్యం, అదీ తల్లిని చూసినప్పుడే.

పల్లవికి అర్థమైంది. తనిప్పుడు వాణ్ణి పట్టుకోవడానికి లేవాలి. వాడు పారిపోతాడు. తను పట్టుకోలేకపోతే పట్టరాని సంతోషంతో కిలకిలమంటాడు. ఏ మధురగాయనికీ అందని స్వరంలో పలికే హాసరాగమది.

పల్లవి లేచి నిలబడింది. బాబు గొంతులోంచీ కేరింత – పాంచజన్యాన్ని పూరించినట్లు. వాడి తప్పటడుగుల్లో వేగం – ఉసైన్ బోల్ట్ ప్రేరణతో.

పల్లవి కదిలింది, "ఒరేయ్, ఆగరా" అంటూ. వాడు ఆగలేదు. ఒలింపిక్ మెడల్ కోసం పరుగెడుతున్నాడు.

పల్లవి నటిస్తోంది. ముందే నిర్ణయించిన ప్రకారం, ఆమె వేగం వాడి వేగాన్ని మించలేకపోతోంది.

బాబు ఆగి వెనక్కి తిరిగి తల్లి అసహాయతని చూసి ఆనందంగా నవ్వాడు. ఆమె అడుగు ముందుకెయ్యగానే మళ్లీ వెనక్కి తిరిగి హడావుడిగా పరుగెత్తబోయి కింద పడ్డాడు.

పల్లవిలో కంగారు – వాడి ముఖం పచ్చడైపోతుందని. కానీ వాడి తప్పటడుగుల అనుభవం తక్కువదేం కాదు. చేతులతో కాసుకుని నేలకి ఆని, నెమ్మదిగా లేచి నిలబడ్డాడు. తల్లి వచ్చేస్తోందని కంగారుగా వెనక్కి చూసి, ఆమె ఆగిందని గ్రహించడంతో, వాడి ముఖంలో గర్వం. పడిపోయినా నాకు నేనుగా లేవగలననీ, పడి లేచినా కూడా నన్నందుకోవడం నీవల్లకాదులే అనీ ఆ గర్వం!

మళ్లీ పరుగు మొదలు. ముందు వాడు, వెనుక ఆమె. ఇద్దరూ హాలంతా పరుగులు. అడుగుల చప్పుడు లయగా, బాబు నవ్వులే స్వరంగా, కొనసాగుతోంది సంగీత కచేరీ మధురంగా.

ఒకసారి పడ్డాడుగా, ఈసారి జాగ్రత్తగా అడుగులేస్తున్నాడు బాబు. మధ్యమధ్య వెనక్కి తిరిగి, తల్లి వెనుకబడి ఉండడం చూసి మురిసిపోతున్నాడు.

అలా ఎంతసేపు – ఐదు నిముషాలు! అంతే, బాబు అలసిపోయాడు. వాడి తప్పటడుగుల వేగం తగ్గింది. ఉన్నట్లుండి ఆగి వెనక్కి తిరిగాడు. పల్లవి నవ్వుతూ వాణ్ణి సమీపించి రెండు చేతులూ ముందుకు చాచింది.

అప్పుడు బాబుకి పోటీ గుర్తు లేదు. గెలుపోటములు తెలియవు. అమ్మ వెచ్చని కౌగిలిలోనే వాడికి హాయి. అమ్మ పిలుపులోని సమ్మోహనశక్తికి లొంగిపోవడమే వాడికి గెలుపు. పరుగున వచ్చాడు.

అమ్మను చేరుకునేటప్పుడు వాడికి జాగ్రత్త తీసుకోవాలని గుర్తుండదు. దాంతో బొక్కబోర్లాపడబోయాడు. కానీ పల్లవి మెరుపు వేగంతో వాడిని చేరుకుని పడిపోకుండా ఆపింది. రెండు రెక్కలూ దొరకపుచ్చుకుని పైకెత్తి వాణ్ణి బలంగా హృదయానికి హత్తుకుంది. వాడు కూడా తల్లిని కరిచిపెట్టుకు పోయాడు....

– – – – –

విడియో ఆఫ్ చేసి కళ్లు తుడుచుకుంది పల్లవి.

ఆమెకింకా బాబుని హత్తుకున్నట్లే ఉంది. పసిబిడ్డని సాకడంలో ఎంత ఆనందం?

ఇంటర్ ప్యాసవగానే తనకి పెళ్లి కుదిరితే, క్లోజ్ ఫ్రెండ్ వనజ తిట్టింది – "లైఫ్ ఎంజాయ్ చెయ్యకుండా ఇప్పట్నించీ పెళ్లేమిటే! ఇంకా చదివి, మన కాళ్లమీద మనం నిలబడి, ఒకటి రెండేళ్లు సరదాలన్నీ తీర్చుకున్నాక, తప్పదంటే అప్పుడాలోచించాలి పెళ్లి గురించి" అని.

ఆ మాట తల్లి జయలక్ష్మికి చెబితే, "నీ ఫ్రెండ్ కూడా పెళ్లి వాయిదా వెయ్యమంది కానీ, వద్దనలేదు. ఏ మనిషికైనా పెళ్లి, పిల్లలే జీవితంలో గొప్ప ఎంజాయ్‌మెంట్! అందుకిదే సరైన వయసు. ఈ వయసు దాటితే – పెళ్లి, పిల్లలు బరువైన బాధ్యతల్లా తోచి జీవితం నిస్సారమౌతుంది. అప్పట్లో నన్ను నిరసించినవాళ్లు తర్వాత నా దగ్గర ఒప్పుకున్న నిజమిది. ఆపైన ఇప్పుడు నీకొచ్చిన సంబంధం, నీ అదృష్టం. కాలదన్నుకుంటే, మళ్లీ ఇలాంటిది దొరకదు.

ఐతే – ఫ్రెండ్ చెప్పిందనో, అమ్మ చెప్పిందనో కాదు. నీ జీవితం నీ ఇష్టం. పెళ్లి విషయంలో ఏ నిర్ణయం తీసుకున్నా, నీకు నా సపోర్టుంటుంది. సరా?” అని తనదైన పద్ధతిలో హామీ ఇచ్చిందామె.

పల్లవి క్లాసులో టాపర్. ఇంకా చదవాలని లేకపోలేదు. కానీ తల్లి మాటలు వినగానే వికాస్ స్ఫురణకొచ్చి మనసు పెళ్లివైపు లాగింది.

వికాస్ వాళ్లకి దూరపు బంధువు. పల్లవికంటే ఐదేళ్లు పెద్ద. చిన్నప్పట్నించీ కొంచెం పరిచయముంది. వాళ్లకి ఆస్తిపాస్తులున్నాయి. ఇంజనీరింగు పూర్తవగానే అతడికి మంచి ఉద్యోగమొచ్చింది. తనకంటే కాస్త చిన్నపిల్లని పెళ్లి చేసుకోవాలనుకున్నాడు. తన భార్య గృహిణిగానే ఉండాలని అతడి ఆశ.

పెళ్లికిముందు ఇద్దరూ ఓసారి కలుసుకుని మాట్లాడుకున్నారు.

“నేను భార్యని ప్రేమిస్తాను. గృహిణిని గౌరవిస్తాను. నా అభిప్రాయంలో భార్య, గృహిణి ఒకటి కాదు. భార్యంటే నాలో సగం. గృహిణి అంటే మనింటి బాధ్యత. చదువులరాణివైన నువ్వు గృహిణి బాధ్యత తీసుకుంటే, నీ నష్టాన్ని పూడ్చాల్సిన బాధ్యత నాది. ప్రతి నెలా నీకు నా శక్తిమేరకి కొంత డబ్బిస్తాను. ఆ డబ్బుపై సర్వాధికారాలూ కేవలం నీవి. నా ఆదాయంలో మిగతాదంతా మనది. దానిపై సర్వాధికారాలూ మనిద్దరివీ. ఏ ఖర్చుకైనా ఇద్దరికీ వీటో చేసే అధికారముంటుంది. అదీ ఆదర్శ దాంపత్యం” అని చెప్పాడు వికాస్ ఆమెకి.

ఒకసారి పెళ్లయ్యేక నువ్వూ, నేనూ అనే తేడా ఉండదని పల్లవి మనసులో అనుకుంది కానీ పైకి అనలేదు. వికాస్ సంస్కారం నచ్చి – అతడికిష్టమైనట్లు మసలాలనుకుంది. ఐనా అడగనూ అడిగింది – తను శాశ్వతంగా గృహిణిగా స్థిరపడిపోవాల్సిందేనా అని.

“కొన్నాళ్లు గృహిణిగా ఉండి చూడు. ఆ జీవితం నీకు నచ్చకపోతే, నీ ఇష్టప్రకారం చదవొచ్చు. ఉద్యోగమూ చెయ్యొచ్చు. అందుకు నా పూర్తి సహకారం ఉంటుంది” అన్నాడు వికాస్. అది నమ్మదగ్గ హామీలా ఉంది.

పెళ్లిలో కట్నాలు, లాంఛనాలు లేవు. ఇరుపక్షాలూ ఖర్చుల్ని లెక్కవేసి సమంగా పంచుకున్నారు.

పల్లవి పద్దెనిమిదేళ్లకి వికాస్ భార్య అయింది. ఇరవైఏళ్లకి బాబుకి తల్లి అయింది.

రోజులు హాయిగా గడిచిపోతున్నాయి. వేరే కెరియర్ గురించి ఆలోచించాల్సిన అగత్యం ఆమెకి రాలేదు. తగిన గౌరవం లభించే హోదా దొరికితే, దాన్నుంచి బయటపడాలని ఎవరూ అనుకోరు.

వికాస్ కూడా కెరియర్లో చకచకా ఎదుగుతున్నాడు. గృహిణిని గౌరవించే మగవాడి ఎదుగుదలకి ఢోకా ఉండదు మరి. ఐనా బాబుకి రెండేళ్లు నిండేక అడిగాడు వికాస్ పల్లవిని – కాలేజీలో చేరతావా అని.

కాలేజి అంటే – రోజూ ఎన్నో గంటలు బాబుని వదిలుండాలి. ఆ ఆలోచనే దుర్భరం ఆమెకి!

అలాగని ఆమె ఇంట్లో ఊరికే కూర్చోలేదు. రెండేళ్లలోనూ కొన్ని కంప్యూటర్ కోర్సులు చేసింది. ఇంట్లోంచే చిన్న ఆన్‌లైన్ ఉద్యోగమొకటి చేస్తోంది. వాళ్లు కొన్ని సర్క్యులర్లు పంపుతారు. ఇంగ్లీషువి తెలుగులోకీ, తెలుగువి ఇంగ్లీషులోకీ తర్జుమా చేసి పంపాలి. అది చేస్తూనే మధ్యమధ్య బాబు విడియోలు చూస్తుంటుందామె. అవి చూసినప్పుడల్లా ఆమెలో ఏవో మధురానుభూతులు. కానీ ఒకోసారి వేరే ఆలోచనలొస్తాయి.

కానీ ఇప్పుడు విడియో చూసిన కారణం వేరు.

ఇంటర్‌తో చదువాపి వికాస్‌ని పెళ్లి చేసుకుని ఓ బాబుకి తల్లిగా సంతృప్తికరమైన జీవితం గడుపుతోంది తను. బాబు తర్వాత పాప. మళ్లీ పాపతోనూ ఇవే అనుభూతులు. ఆ తర్వాత....

పిల్లలు పెద్దవాళ్లయి క్రమంగా తనకి దూరమౌతారు. వికాస్‌కి తన ఉద్యోగమే ఓ వ్యాపకం. మరి తనేం చెయ్యాలి? అప్పుడు కొత్తగా కెరియర్ ఆరంభించగలదా?

తన క్లాస్‌మేట్సు చాలామంది ఇంజనీరింగ్ పూర్తి చేశారు. కెరియర్ గురించే ఆలోచిస్తున్నారు.

తప్పు చేశానా అనిపిస్తుంది. ఆ వెంటనే, ‘అందమైన జీవితమంటే, ఆదాయం తెచ్చిపెట్టే కెరియర్ మాత్రమే కాదు. ఇరవైఏళ్ల లేత యౌవనంలో – భర్తతో అర్ధాంగిత్వం, బాబుతో మాతృత్వం ఓ అపూర్వం. ఆడపిల్లకి ఇదీ ఓ గొప్ప కెరియర్. ఈ మధురానుభూతుల పరిమళాన్ని ఆస్వాదించడానికి ముగ్ధత్వం అవసరం. అది ముప్పైఏళ్ల వయసులో దొరకదు’ అన్న తల్లి మాటలు గుర్తుకొస్తాయి.

కానీ ఈ ముగ్ధత్వం ఎవరికోసం అని ఆలోచిస్తే – తన ఇంటి పేరు భర్తది. తన బాబు ఇంటిపేరు భర్తది. తను పెళ్లి చేసుకున్నది భర్త వంశాభివృద్ధికోసం. మరి తన ఉనికికి గుర్తింపు ఏదీ?

ఇలా ఆలోచించినప్పుడు ఆమెకి మళ్లీ తల్లి గుర్తుకొస్తుంది.

జయలక్ష్మి టెన్తులో టాపర్. సైన్సు, మాథ్స్ ఆమెకి ఇష్టమైన సబ్జక్ట్సు. కానీ తలిదండ్రులు ఇంటరవగానే పెళ్లి చేసేశారు. ఆమెకింకా చదవాలనుంది. ఆమె ఉత్సాహం చూసి శ్రీరాం సరేనంటే, ప్రయివేటుగా ఎమ్మే దాకా చదివింది. తర్వాత బియ్యీడీ కూడా చేసింది. పిల్లలు కాస్త పెద్దవాళ్లయ్యేక కొన్నాళ్లు టీచరుద్యోగం చేసింది. ఇంటి బాధ్యతలతో పొసగక, ఆ ఉద్యోగం మానేసి పూర్తిగా ఇంటికే అంకితమైపోయింది.

శ్రీరాం జయలక్ష్మికి అంతగా విలువివ్వడనిపించేది పిల్లలకి. సంపాదిస్తున్నానన్న అహం అప్పుడప్పుడు స్ఫురించేది. జయలక్ష్మి పట్టించుకునేది కాదు. ఒకసారి పల్లవే ఆమెని ఆ విషయమై నిలదీసింది.

"దాంపత్యమంటే రెండు వ్యక్తిత్వాల ఏకత్వం అంటారు. అది మా విషయంలో పూర్తిగా నిజం. ఆయన నన్నేమన్నా నాకది అహంలా అనిపించదు. ఆ క్షణంలో ఆయన మానసిక స్థితి తెలుసుకుందుకు పనికొస్తుంది. ఎవరు ఎవర్ని నిందించినా అది ఇద్దరికీ వర్తిస్తుందనే తప్ప, ఒకరికి చిన్నతనమని మాకనిపించదు. అందుకే మామధ్య ఏ పొరపొచ్చాలూ లేవు" అని తేలిగ్గా తీసిపారేసిందామె.

భర్త, పిల్లలు – ఇదేనా తన జీవితం అన్న ఆలోచన వచ్చినప్పుడు కలిగిన నిస్పృహని ఒకసారి ఫోన్లో తల్లితో పంచుకుందామె. అప్పుడు జయలక్ష్మి నవ్వేసి, 'కారే రాజులు? రాజ్యముల్ కలుగవే? గర్వోన్నతిన్ బొందరే? వారేరీ? సిరి మూట కట్టుకొని పోవంజాలిరే? భూమిపై పేరైనం గలదే? శిబి ప్రముఖులున్ ప్రీతిన్ యశఃకాములై ఈరే కోర్కెలు? వారలన్ మరచిరే ఇక్కాలమున్' అంటూ భాగవతంలోని పద్యం ఒకటి వినిపించింది. తర్వాత, "ఎవరు తమ ఉనికిని త్యాగం చేస్తున్నామనుకుంటున్నారో, వారే శిబి ప్రముఖులు! మనింట్లో పేరు నాన్నదని నువ్వనుకుంటున్నావు. పిల్లల హృదయాల్లో నా స్థానమెప్పుడూ పదిలమేనని నేననుకుంటాను" అందామె.

నిజానికి పల్లవికీ అసంతృప్తి లేదు. మెజారిటీకి భిన్నంగా ఉన్నప్పుడు, మోరల్ సపోర్టు కోసం తల్లికి ఫోన్ చేసింది. అది లభించగానే, "వికాస్ నా ప్రాణం. బాబు నాకు ప్రాణాతిప్రాణం" అనుకుందామె.

"ఉంటానే మరి లవ్‌లీ" అని ఫోన్ పెట్టేసింది జయలక్ష్మి.

ఉలిక్కిపడింది పల్లవి. 'లవ్‌లీ" – అన్న ఆ పదమే ఈ రోజు ఆమె బాబు విడియో చూడ్డానికి కారణం. చూస్తున్నప్పుడు కళ్లలో నీళ్లు తిరగడానికీ కారణం.

లవ్‌లీ జయలక్ష్మి ఆమెకి పెట్టుకున్న ముద్దుపేరు. మిగతావాళ్లంతా పల్లూ అంటే, తల్లిమాత్రం లవ్‌లీ అంటుంది. ఆమె నోట ఆ పిలుపు కలిగించే మధురానుభూతి అనుభవైకవేద్యం. అది పలచనైపోకూడదనే, భర్తకి కూడా తనని లవ్‌లీ అనే అవకాశమివ్వలేదు పల్లవి.

గంట క్రితం పల్లవికి ఓ ఫోనొచ్చింది. చేసింది సుధీర్. అతడామెని, 'హలో' అనలేదు. 'లవ్‌లీ' అన్నాడు.

అతడలాగనడం మొదటిసారి కాదు. ఆ పిలుపుకి ఆమెలో కలిగిన కలవరం వళ్లంతా వణుకు పుట్టించింది.

ఆమె బాబు విడియో చూడ్డానికి కూడా, ఆ ఫోన్‌కాలే కారణం!

– – – – –

పల్లవి టెన్తుకొచ్చినప్పుడు సుధీర్ అదే స్కూల్లో ఆరులో చేరాడు. ఒకరోజు సుధీర్ తల్లి గౌరి జయలక్ష్మికి ఫోన్ చేసి, తన్నుతాను పరిచయం చేసుకుని, "మా సుధీర్ లెక్కల్లో వీక్. మీ అమ్మాయి హెల్ప్ కావాలంటున్నాడు. డ్రైవర్నిచ్చి కార్లో పంపిస్తాను. ఓ గంటలో డౌట్సు తీర్చుకుని వెళ్లిపోతాడు. ఈలోగా కావాలంటే మీరు కారు కూడా ఉపయోగించుకోవచ్చు" అంది.

గౌరి గొప్పింటిది. స్నేహపూర్వకంగా మాట్లాడింది. హెల్పు కావాల్సింది ఆరో తరగతి కుర్రాడికి. జయలక్ష్మికి కాదనడానికి కారణం కనబడలేదు. సుధీర్‌కి పల్లవి దగ్గర స్టడీస్ మొదలయ్యాయి.

నాలుగు రోజులు గడిచేసరికి పల్లవికి అర్థమైపోయింది – సుధీర్ చాలా తెలివైనవాడని. "నీకు నా హెల్ప్ అవసరం లేదు" అని చెప్పిందామె మెచ్చుకోలుగా.

“ఆ విషయం నాకూ తెలుసు లవ్‌లీ” అన్నాడు సుధీర్ వెంటనే.

పల్లవి ఉలిక్కిపడి, నీకా పేరెలా తెలుసని అడిగితే, “నువ్వు నాకు ముద్దొస్తావు. నీ ముద్దు పేరు తెలియకుండా ఉంటుందా?” అన్నాడు.

పల్లవి తెల్లబోయింది. ఐనా అతడి వయసుని దృష్టిలో ఉంచుకుని, “తప్పు. ఇలా మాట్లాడొచ్చా?” అంది.

సుధీర్ వెంటనే, “ఐలవ్‌యూ లవ్‌లీ. నిన్ను చూస్తే ఇలాగే మాట్లాడాలనిపిస్తుంది” అన్నాడు.

పల్లవి ఇంకా అతణ్ణి సీరియస్‌గా తీసుకోలేదు, “ప్రేమించాలంటే నీ వయసువాళ్లని చూసుకో. నేను నీకంటే నాలుగేళ్లు పెద్దదాన్ని!” అంది నవ్వుతూ.

“నీకు తెలీదా? తెండూల్కర్ భార్య అంజలి కూడా తనకంటే నాలుగేళ్లు పెద్ద” అన్నాడు సుధీర్ వెంటనే.

మాటలు దూరం వెడుతున్నాయని అర్థమైంది పల్లవికి. ఐనా సౌమ్యంగా, “పెద్దయ్యేక నీకంటే పెద్దమ్మాయిని పెళ్లి చేసుకోవచ్చులే. ప్రస్తుతానికి బుద్ధిగా చదువుకో” అంది.

“నేను పెద్దయ్యేసరికి నీకు పెళ్లైపోతుంది. నేను తట్టుకోలేను. నువ్వు నా ప్రాణం” అన్నాడు సుధీర్.

“అలాగని ఇప్పుడెలా పెళ్లి చేసుకుంటావ్, చట్ట ప్రకారం నేరం” అంది పల్లవి ఆరిందాలా.

“అందుకో ఉపాయముంది. ఇప్పుడు నాతో కమిటైపో. ఒక్కసారి కమిటైపోతే, మంచింటి ఆడపిల్ల మరో పెళ్లి జోలికి వెళ్లదుటగా” అన్నాడు సుధీర్.

బదులుగా పల్లవి అతణ్ణి సాచి లెంపకాయ కొట్టింది.

“నన్ను కొడతావా, ఫలితం అనుభవిస్తావ్. నేను నిన్ను వదలను” అని సినిమా హీరోల్లా చూపుడువేలితో హెచ్చరిస్తూ వెళ్లిపోయాడు సుధీర్.

పల్లవి ఊరుకోలేదు. జరిగింది తల్లికి చెప్పింది. ఆమె సుధీర్ తల్లికి ఫోన్లో జరిగింది చెప్పి, “స్కూల్లో ఫిర్యాదు చేయాల్సిన అవసరం రానివ్వకండి” అంది. తర్వాతేమయిందో, సుధీర్ స్కూలు మారాడు.

ఆతర్వాత ఇన్నేళ్లకి ఈ రోజు ఫోనొచ్చేదాకా, సుధీర్ విషయమే మర్చిపోయిందామె.

సుధీర్ ఫోన్లో సూటిగానే చెప్పాడు. అతడికి పల్లవి కావాలి. వారం రోజులు టైమిచ్చాడు. తనకి తానుగా లొంగిపోతే, గుట్టుగా ఉంటుంది. లేదూ, ఆమె కొడుకుని కిడ్నాప్ చేసి, ఆమెని రేప్ చెయ్యడానికి ఆయుధంగా వాడుకుంటానని బెదిరించాడు.

“నీ గురించి వెంటనే పోలీస్ కంప్లయింటిస్తాను” అంది పల్లవి వెంటనే.

“బీహార్లో రాకీ, ఆదిత్యని ఏంచేశాడో తెలుసుగా! నాదీ అదే లెవెలు. నా వెనకాల డబ్బుంది, పవరుంది. బుద్ధిగా నేను చెప్పినట్లు వింటే, సరే! లేకపోతే నీ బ్రతుకే బజారు పాలౌతుంది. నన్నెవరూ ఏంచెయ్యలేరు”

ఏ గుర్తింపూ లేని గృహిణి జీవితంపై మోజుతో, చదువూ కెరియర్ల భవిష్యత్తుని త్యాగం చేసిన సామాన్య మహిళ పల్లవి. ఆమె భవిష్యత్తుపై పంజా విసురుతున్నాడు సుధీర్. భయపడిపోయిన పల్లవి డైవర్షన్‌కి బాబు విడియో చూస్తే, వాడి భవిష్యత్తు స్ఫురించి కంట్లో నీరు, వంట్లో వణుకు పుట్టింది.

---

ఖద్దరు పంచె, ఖద్దరు లాల్చీ, ఖద్దరు కండువా. రామనాథం బయల్దేరుతుంటే, “రెండ్రోజుల్నించి బయటికెళ్ల నివ్వకుండా గదిలో పెట్టి ఉంచారు సుధీర్ని. కన్నబిడ్డన్న జాలి కూడా లేదా మీకు?” అంది గౌరి.

ఆయన ఆగి, “వాడిమీద జాలే కాదు, ప్రేమా ఉంది కాబట్టే – అలా చేశాను. పల్లవి విషయంలో ఒక్క రోజు కూడా ఆగనంటే ఏంచేసేది? అనుకున్నట్లు బర్త్ సర్టిఫికెట్ వస్తే సరేసరి, లేకుంటే – వాణ్ణి కొన్నాళ్లు ఫారిన్ పంపేస్తాను!” అన్నాడు.

"అప్పుడేమో, మీ పెదనాన్నగారు మేజర్లయిన మనవళ్లకందరికీ తలో రెండు కోట్లూ ఇస్తానన్నాడని, కక్కుర్తిపడి మన సుధీర్ బర్త్ సర్టిఫికెట్ మార్పించి, వయసు ఏడాది పెంచి మేజర్ని చేశారు. తల్లి పుట్టిల్లు మేనమామ కెరుకే కదా, ఆయన మనవాడికి పైసా ఇవ్వలేదు. ఇప్పుడేమో బర్త్ సర్టిఫికెట్ మళ్లీ యథాప్రకారం మార్పిస్తున్నారు. దీనివల్లమాత్రం వాడికి ప్రయోజనముంటుందని నమ్మకమేమిటి?" విసుక్కుంది గౌరి.

రామనాథం ఏదో అనబోగా జేబులో మొబైల్ మ్రోగింది. తీసి అవతలి మనిషి చెప్పింది విని, "పది లక్షలు కాదు, ఇరవై ఇస్తాను. కానీ సర్టిఫికెట్ ఇంకో గంటలో రావాలి. రేపటిదాకా తేలీదంటే, నాకిక దాంతో పని లేదు. ఒక్క పైసా కూడా ఇవ్వను, తెలిసిందా?" అన్నాడు చిరాగ్గా.

"ఏంటీ, ఒరిజినల్ సర్టిఫికెట్ రిస్టోర్ ఔతుందిటా?" అంది గౌరి కుతూహలంగా.

రామనాథం మొబైల్ కట్ చేసి, "ఔతుందని గ్యారంటీ ఇవ్వలేదు. ఏ విషయం రేపు తెలుస్తుందిట. సర్టిఫికెట్ రిస్టోరైతే రేపటితో మనవాడికి పద్దెనిమిది నిండుతాయి. అంటే మనవాడికిక ఈవేళ ఒక్కరోజే టైముంది. అసలే మీడియా స్టింగులు పట్టుకు తిరుగుతున్న రోజులివి. సర్టిఫికేట్ రిస్టోరైతే, మనవాడు దొరికిపోయినా, జువెనైల్‌గా చిన్న శిక్షతో బయటపడొచ్చు. ఆ విషయం అర్థం చేసుకోకుండా, ఒక్క రోజుకి తేడా ఏమిటంటాడు ఫోన్లో వాడు" అని విసుక్కున్నాడు.

అచ్చోసిన ఆంబోతులు విచ్చలవిడిగా తిరుగుతున్న దేశంలో –
నేరాల్ని బర్త్ సర్టిఫికెట్లతో ముడిపెట్టిన చట్టంతో –
ఒక్క రోజు కొందరి జీవితాన్నే మార్చేస్తుందని ఆయనకే కాదు, పల్లవికీ తెలుసు!

---0---

★★★★★★★

Click here to share your comments on this story